## అభివృద్ధే గువ్వల బాలరాజును గెలిపిస్తాయి

లింగాల, అక్టోబర్ 13 : నియోజకవర్గంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేసిన అభివృద్ధే మూడోసారి గెలిపిస్తాయని సింగిల్ విండో చైర్మన్ హన్మంత్ రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా నియోజకవర్గం అన్ని రంగాల్లో ప్రభుత్వ విప్ ఆధ్వర్యంలో అభివృద్ధి చెందిందన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమాభివృద్ధి ఏదో ఒక రూపంలో ప్రతిగడపకూ చేరిందన్నారు. ప్రతిక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ అహర్నిశలు కృషి చేసి వారి బాగోగులు చూసుకొనే నాయకుడు గువ్వల బాలరాజు అని అన్నారు. ఈ నెల 17న మంగళవారం మండలంలోని అంబట్‌పల్లి నుంచి విప్ గువ్వల మూడోసారి గెలవాలని కోరుతూ బల్మూర్ మండలంలోని కనకాల మైసమ్మ ఆలయం వరకు పాద యాత్ర చేస్తున్నట్లు తెలిపారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన




పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల రూట్ అధికారి నాగార్జునరెడ్డి

లింగాల, అక్టోబర్ 13 : మండలంలోని దత్తారం, బాకారం, జీలుగుపల్లి, వల్లభాపూర్ తదితర పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎన్నికల రూట్ అధికారి నాగార్జునరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, బాత్‌రూంలు, తాగునీరు సౌకర్యాలను ఏ విధంగా ఉన్నాయే పరిశీలించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తానని ఆయన తెలిపారు.

## తపాలా ఖాతాలను సద్వినియోగం చేసుకోవాలి



ఖాతాలపై అవగాహన కల్పిస్తున్న వనపర్తి డివిజన్ అధికారి వెంకట్‌రెడ్డి

లింగాల,అక్టోబర్ 13 : తపాలాశాఖలో ఉన్న స్కీంలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి డివిజన్ అధికారి బీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌పోస్టాఫీస్ ఆవరణలో పోస్టాఫీస్ ఖాతాదారులకు సేవింగ్ అకౌంట్స్, ఇన్సూరెన్స్ తదితర స్కీంలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందితే ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. జీఏజీ ప్రమాదబీమా పొంది ఇటీవల మండలంలోని వల్లభాపూర్‌కు చెందిన ఆకుల లక్ష్మయ్య మరణిస్తే మృతుడి భార్య కాశమ్మకు రూ.10లక్షలు చెక్కును అందజేసినట్లు తెలిపారు. తపాలా సేవలను సద్వినియోగం చేసుకొని కుటుంబ పోషణకు అనుకూలంగా మరల్చుకొవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఈవో గీతాంజలి, జిల్లా తపాలా అధికారి విక్రమ్, ఐపీపీబీ మేనేజర్ యశశ్విప్రసాద్, ఈవో భాగ్యమ్మ, బీపీఎం బాలాజీనాయక్ పాల్గొన్నారు.

## పథకాల అమలుకు మినహాయింపు ఇవ్వాలి

పాన్‌గల్,అక్టోబర్13 : ఎన్నికల కోడ్‌తో సంక్షేమ పథకాల లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోందని, అత్యవసర పథకాలకు మినహాయింపు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కేతూరి శ్రీరాం కోరారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొనసాగుతున్న సంక్షేమ పథకాలను కోడ్ కారణంగా తాత్కాలికంగా ఆపేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రకటించడం ఆందోళనకు కారణమన్నారు. ఆసరా పింఛన్లు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ రెండు నెలలు ఆగిపోనుందని తెలిపారు.

## వాహనాల తనిఖీల్లో రూ.2,67లక్షలు నగదు

కొల్లాపూర్, అక్టోబర్ 13 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలను కొల్లాపూర్ పోలీసులు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం పట్టణంలోని గాంధీచౌక్ వద్ద వాహనాలను తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి వద్ద రూ.2లక్షల67 వేలు లభించింది. మండలంలోని ఎన్మన్‌బెట్ల తండాకు చెందిన సూర్యానాయక్‌గా గుర్తించారు. అనుమానాస్పద నగదును సీజ్ చేసి జిల్లా ఎలక్షన్ అధికారికి పంపినట్లు స్థానిక ఎస్సై బీవీ రమణ శుక్రవారం రాత్రి తెలిపారు.

# మూడోసారి విజయం బీఆర్ఎస్‌దే..

- వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- కార్యకర్తల బలగమే కొండంత ధైర్యం
- 50వేల మెజార్టీ సాధిస్తా
- కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వవిప్ గువ్వల



ఉప్పునుంతలలో కేరింతలతో విప్ గువ్వలను మోసుకెళ్తున్న కార్యకర్తలు

ఉప్పునుంతల, అక్టోబర్ 13 : ప్రతిపక్షాలు ఎన్ని పన్నాగాలు పన్నినా ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, తాను 50 వేల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ప్రభుత్వవిప్ గువ్వల బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో యశోద గార్డెన్‌లో మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ప్రతిపక్షాలు మతాల పేరిట, కులాల పేరిట రాజకీయాలు చేసి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని, ప్రజలు వారి మాయమాటలను నమ్మరన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టని సంక్షేమ పథకాలను చేపట్టి ప్రభుత్వ ఫలాలను పార్టీలకతీతంగా అందిస్తున్నామన్నారు. 60 ఏండ్లలో చేయని అభివృద్ధిని తొమ్మిదేండ్లలో చేసి చూపించామన్నారు. కృష్ణమ్మ నీళ్లతో పంట పొలాలు పచ్చబడ్డాయని చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయన్నారు. పదవులను అనుభవించి పార్టీ ఫిరాయించిన నాయకులకు ప్రజల చేతిలో భంగపాటు తప్పదన్నారు. ఆరోగ్యరీత్యా మంత్రి కేటీఆర్ పర్యటన వాయిదా పడితే కాంగ్రెస్ నాయకులు పైశాచిక ఆనందం పొందారని, ఈ నెల 26న అచ్చంపేటలో నిర్వహించే కేటీఆర్ సభను చూసి కాంగ్రెస్ నాయకులు బిత్తర పోవాలన్నారు. ప్రజా నాయకుడంటే ప్రజల హృదయాల్లో ఉండాలని, నిత్యం ప్రజాసమస్యలను పరిష్కరించాలన్నారు. నియోజకవర్గంలో ఎదుగుతున్న ఒక దళిత బిడ్డను గొంతును అణగదొక్కాలని కాంగ్రెస్ నాయకులు యత్నిస్తున్నారన్నారు. కంఠంలో ప్రాణమున్నంతవరకు నియోజకవర్గ అభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తానని, కార్యకర్తల బలగమే తనకు కొండంత ధైర్యమన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన అపర భగీరథుడు, దశాబ్దాల కలను సాకారం చేసి బంగారు తెలంగాణకు బాటలు వేసి దేశమే తెలంగాణ రాష్ట్రం వైపు చూసేలా అభివృద్ధికి శ్రీకారం చుట్టిన మహానేత సీఎం కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణ, సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రావు, పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ గోపాల్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాలునాయక్, సర్పంచులు పర్వతాలు, అలివేల, ఎంపీటీసీ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

### కూలీలతో గువ్వల మాటామంతి

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 13 : కూలి బిడ్డగా వారు పడుతున్న పాట్లు తెలుసని ప్రభుత్వ విప్ డా.గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని లింగాల చౌరస్తాలో కూలీలతో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేను కూడా ఒక కూలి కుటుంబం నుంచి వచ్చానని, నా తల్లిదండ్రులు చదివించి నన్ను ఈ స్థాయికి తెచ్చారన్నారు. మీ పిల్లలను మంచిగా చదివించి ఉన్నత స్థానాల్లో ఉంచాలని ఆకాంక్షించారు. మళ్లీ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వమే వస్తుందని, ప్రతి ఒక్కరికీ వివిధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్, ఐటీశాఖా మంత్రి కేటీఆర్ నేతృత్వంలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, దాని ద్వారా వేల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### క్రీడలకు నిలయంగా అచ్చంపేట

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 13 : క్రీడలకు నిలయంగా అచ్చంపేట మైదానాలు రూపు దిద్దుకున్నాయని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వాహకులు, క్రీడాకారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. అచ్చంపేట స్టేడియంలో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి క్రీడలకు నిలయాలుగా మారాయన్నారు. అనంతరం క్రీడాకారులతో కలిసి ఆటలో ఆడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### బాసునాయక్ సేవలు గొప్పవి

బల్మూరు,అక్టోబర్ 13 : అచ్చంపేట పీఆర్ డీఈ కేతావత్ బాసునాయక్ సేవలు గొప్పవని అకాలమరణం ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. గురువారం సాయంత్రం బాష్యానాయక్ గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం ఉదయం మృతుడి స్వగ్రామం అంబగిరిలో ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛం పెట్టి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం, భరోసా కల్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మనోహర్, తులసీరాం, గోపాల్‌నాయక్, వెంకట్‌రెడ్డి, ఎంపీపీ అరుణ, విండోచైర్మన్ నర్సయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల ఆలయంలో పీయూ వైస్‌చాన్స్‌లర్ పూజలు



సోమేశ్వరస్వామి పూజిస్తున్న లక్ష్మీకాంత్ రాథోడ్

కొల్లాపూర్, అక్టోబర్ 13 : మండలంలోని సోమశిలలో లలితా సోమేశ్వరస్వామిని పాలమూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ లక్ష్మీకాంత్ రాథోడ్ శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించి వేద ఆశీర్వచనం అందజేశారు. అంతకు ముందు పట్టణ శివారులో హాసిని బీపెడ్ కళాశాల, పీజీ కళాశాల, సాహితీ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు వైస్‌చాన్స్‌లర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అలాగే శ్రీగాయిత్రి ఎడ్యూకేషన్స్‌కు సంబంధించిన హాసిని బీపెడ్ కళాశాల విద్యార్థి గణేశ్ యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర గవర్నర్‌చే ప్రశంసలు పొందారు. అలాగే శ్రీనివాస డిగ్రీ కళాశాల విద్యార్థిని మాహియా యూనివర్సిటీ టాపర్ 10/10 సాధించడంతో అదేవిధంగా గాయిత్రీ కళాశాల విద్యార్థులు వరుసగా రాష్ట్ర స్థాయిలో 4,5వ ర్యాంకులను సాధించి,ఇటీవల ప్రకటించిన పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికకావడంతో శ్రీగాయిత్రి ఎడ్యూకేషన్స్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్‌ను పీయూ వైస్‌చాన్సలర్ అభినందించారు. ఆ తరువాత శ్రీగాయిత్రీ ఎడ్యూకేషన్స్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును సందర్శించారు కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ అధికారులు డాక్టర్ రాజేశ్, డాక్టర్ దీప్లానాయక్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## పాఠశాలలో బతుకమ్మ సంబురాలు

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 13 : అచ్చంపేట పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో శుక్రవారం బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల అధ్యక్షుడు సత్యనారాయణ హాజరై మాట్లాడారు. బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర సంప్రదాయాలకు ప్రతీకగా, హిందూ పండుగల్లో బతుకమ్మ పండుగను గౌరీ పండుగ అని కూడా అంటారని తెలిపారు. రంగు, రంగుల పూలతో ఆడపడుచులు బొడ్డెమ్మను పేర్చి చప్పట్లతో బతుకమ్మ ఆడుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ క్రాంతికుమార్, పాండురంగం, కోట భాస్కర్, సంగం నందకిశోర్, కంచెర్ల ఆనంద్, వెంకటేశ్, ఇందిరమ్మ, ఉదయకుమారి, స్వప్న, కృష్ణవేణి, మాధవి, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### డిగ్రీకళాశాలలో ..

బల్మూరు, అక్టోబర్ 13 : మండలంలోని కొండనాగుల డిగ్రీకళశాలలో శుక్రవారం విద్యార్థులు ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించారు. కళాశాల ఆవరణలో వివిధ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్రం, నర్సింహారావు, రవి, వెంకటయ్య, ముంతాజ్‌బేగం, కళాశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.



బతుకమ్మ సంబురాల్లో విద్యార్థులు